
అనుక్షణం ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..




విపరీతంగా పెరిగిన విమాన టికెట్ల ధరలు

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక - 233 ఆదివారం 7 డిసెంబర్ 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## సిరీస్ కైవసం

### వైజాగ్ వన్డేలో టీమిండియా ఘన విజయం...

- మూడో వన్డేలో దక్షిణాఫ్రికాను చిత్తు చేసిన భారత్
- అజేయ సెంచరీతో చెలరేగిన యశస్వి జైస్వాల్
- చెరో నాలుగు వికెట్లతో సత్తా చాటిన కుల్దీప్, ప్రసిద్ధ్ కృష్ణ



2లో.

## రూపాయి పతనం పూర్తిగా ప్రతికూలం కాదు

- ఎగుమతిదారులకు ప్రయోజనకరమేనన్న నిర్మలా సీతారామన్
- డాలర్ తో పోలిస్తే రికార్డు స్థాయిలో పడిపోయిన రూపాయి విలువ
- సమీప భవిష్యత్తులో రూ.91 మార్క్ తాకనుందని అంచనా



## ఎస్ఎల్‌బీసీ పూర్తి చేసి నల్గొండ జిల్లాకు నీరు అందిస్తాం



- కేసీఆర్ పదేళ్లపాటు పట్టించుకోకుండా నిర్లక్ష్యం
- ప్రజలను పట్టించుకోకుండా కెసిఆర్ పాలన
- కాంగ్రెస్ ప్రభుత్వం ఆగానే కొత్త రేషన్ కార్డులు
- దొడ్డు బియ్యం రద్దు చేసి సన్నబియ్యం ఇస్తున్నాం
- పేదలకు 4.50లక్షల ఇళ్లు మంజూరు చేశాం
- దేవరకొండ సభలో సిఎం రేవంత్

దేవరకొండ, **డిసెంబర్ 6(జర్నలిస్ట్ వార్త):** గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ప్రాజెక్టులను పండబెట్టారని, ఈ ప్రభుత్వ హయాంలోనే ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు పూర్తి చేసి నల్గొండ జిల్లాకు నీరు అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఎస్ఎల్‌బీసీను కేసీఆర్ పదేళ్లపాటు పట్టించుకోలేదు, నిర్లక్ష్యం చేశారు. ఎస్ఎల్‌బీసీ ఆగిందని మామ, అల్లుడు డ్యాన్సులు చేస్తున్నారు. ఎవరూ అడ్డుపడ్డా ఎస్ఎల్‌బీసీను పూర్తిచేసి తీరుతాం' అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. 2లో...



## ఇండిగోపై కేంద్రంకన్నెర్ర..

### సీఈఓ తొలగింపు, భారీ జరిమానాకు యోచన..!

- పైలట్ల విశ్రాంతి నిబంధనల అమలులో గందరగోళం
- భారీ జరిమానాతో పాటు విమానాల సంఖ్య తగ్గింపునకు యోచన
- కొత్త నిబంధనలను తాత్కాలికంగా నిలిపివేసిన ప్రభుత్వం
- సంక్షోభంపై ఉన్నత స్థాయి విచారణకు ఆదేశం

2లో.





## హిల్ట్ పాలసీపైతెలంగాణ హైకోర్టు స్టేకు నిరాకరణ..

### ఇది కేవలం విధానపరమైన ప్రకటనేనన్న ప్రభుత్వ వాదనతో ఏకీభావం

- కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు
- కాలుష్య పరిశ్రమల తరలింపుకే పాలసీ తెచ్చామన్న అడ్వకేట్ జనరల్
- మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధమంటూ పిటిషనర్ల ఆందోళన




2లో.

## కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా కేంద్రంపై పోరాడుదాం

- విదేశీ చట్టాలను మనదేశంలో ఎలా తెస్తారు
- ఇక్కడి సామాజిక పరిస్థితులు వేరు కదా
- రౌండ్ టేబుల్ సమావేశంలో కెటిఆర్ పిలుపు

హైదరాబాద్,**డిసెంబర్ 6(జర్నలిస్ట్ వార్త):** ప్రపంచంలోనే అత్యంత కుబేరులు భారతదేశంలో ఉన్నారని, అలాగే అత్యంత పేదరికం కూడా ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. 'ప్రపంచమే కుగ్రామం' అనే పేరుతో అమెరికా, ఐరోపాలో తెచ్చిన చట్టాలను ఇక్కడ తెస్తే కుదరదని హెచ్చరించారు. ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్లలో భాగంగా కొత్త సంస్కరణలు తెస్తున్నారని, అయితే.. సామాజిక స్థితులను పరిగణనలోకి తీసుకోకుండా ఏ చట్టాలు తెచ్చినా వాటిపై తిరగబడాల్సిందేనని కేటీఆర్ హెచ్చరిక చేశారు. తెలంగాణ భవన్‌లో కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ మీటింగ్‌లో కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. మిగతా 2లో...



## సాగు విస్తీర్ణం ఆధారంగా యూరియా పంపిణీ!

- కీలక నిర్ణయం దిశగా తెలంగాణ ప్రభుత్వం!
- సాగు లెక్కల కోసం ప్రత్యేక యాప్ అభివృద్ధి



హైదరాబాద్, **డిసెంబర్ 6(జర్నలిస్ట్ వార్త):** వానాకాలం సాగు సమయంలో తెలంగాణలో యూరియా కోసం రైతుల ఎన్ని ఇబ్బందులు పడ్డారో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. బస్తా యూరియా కోసం గంటల కొద్దీ కిలోమీటర్ల మేర క్యూలైన్లలో నిల్చున్నారు. మిగతా 2లో...

## మహానటి సావిత్రికి మరణం లేదు

- చిత్ర పరిశ్రమలో ఆమె చరిత్ర చిరస్థాయి
- అలాంటి నటులు నేడు లేరు..రారు
- మంచి సినిమాలు తీస్తే అంతా ఆదరిస్తారు
- సావిత్రి మహోత్సవంలో వెంకయ్యనాయుడు

హైదరాబాద్,**డిసెంబర్ 6(జర్నలిస్ట్ వార్త):**)మహానటి సావిత్రికి మరణం లేదని, ఆమె చరిత్ర అజరామరమని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు అన్నారు. చిత్రపరిశ్రమ ఉన్నంత వరకు ఆమె జీవిస్తూనే ఉంటుందని అన్నారు. 'మహానటి' సావిత్రి 90వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన ఆయన అనేక విషయాలపై మాట్లాడారు. మహానటిగా ప్రేక్షకాభిమానం సొంతం చేసుకున్న సావిత్రి 90వ జయంతి సందర్భంగా ఆమెకు నివాళి అర్పిస్తున్నా. 'సావిత్రి మహోత్సవం' అనిమిగతా 2లో...



## గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్ల పరిశీలన


### ఏరియల్ సర్వే నిర్వహించిన సిఎం రేవంత్

హైదరాబాద్,**డిసెంబర్ 6(జర్నలిస్ట్ వార్త):**తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. శనివారం సాయంత్రం ఏరియల్ వ్యూ ద్వారా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను పరిశీలించారు. రేవంత్ వెంట మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కూడా ఉన్నారు. మిగతా 2లో...




## తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం..

### ఐదుగురు ఏపీ భక్తుల మృతి



# ఇండిగోపై కేంద్రం కన్నెర్ర..

న్యూఢిల్లీ **డిసెంబర్ 6(జర్నలిస్ట్ వార్త):**
దేశీయ విమానయాన దిగ్గజం ఇండిగోపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. పైలట్ల విశ్రాంతి సమయానికి సంబంధించిన కొత్త నిబంధనల అమలులో గందరగోళం సృష్టించి, దేశవ్యాప్తంగా భారీగా విమానాలను రద్దు చేసినందుకు ఇండిగో సీఈఓ పీటర్ ఎల్బర్స్‌ను పదవి నుంచి తొలగించాలని ఆ సంస్థను కోరాలని కేంద్రం యోచిస్తున్నట్లు సమాచారం.ఇండిగో వైఫల్యం కారణంగా వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురైన నేపథ్యంలో పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఆ సంస్థ అధికారులను ఇవాళ సాయంత్రం సమావేశానికి పిలిపించింది. సంస్థపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని, ఇందులో భాగంగా భారీ జరిమానా విధించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఇండిగో నిర్వహించే విమానాల సంఖ్యను తగ్గించడం ద్వారా దేశంలోనే అతిపెద్ద విమానయాన సంస్థకు గట్టి సంకేతాలు పంపాలని యోచిస్తోంది.పైలట్లకు సుదీర్ఘ విశ్రాంతి కల్పించేందుకు ఏవియేషన్ రెగ్యులేటర్ తీసుకొచ్చిన కొత్త ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్ నిబంధనలకు అనుగుణంగా అవసరమైన పైలట్ల సంఖ్యను ఇండిగో యాజమాన్యం తప్పుగా అంచనా వేసింది. దీంతో ఒక్కసారిగా పైలట్ల కొరత ఏర్పడి, దేశీయ సర్వీసులను నడపడంలో సంస్థ తీవ్రంగా విఫలమైంది.ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం ప్రస్తుతానికి ఈ కొత్త ఎఫ్‌డీటీఎల్ నిబంధనలను తాత్కాలికంగా నిలిపివేసింది. మూడు రోజుల్లో పరిస్థితి చక్కబడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ సంక్షోభంపై ఉన్నత స్థాయి విచారణకు కూడా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# హిల్ట్ పాలసీపైతెలంగాణ హైకోర్టు స్టేకు నిరాకరణ..

## ఇది కేవలం విధానపరమైన ప్రకటనేనన్న ప్రభుత్వ వాదనతో ఏకీభావం

హైదరాబాద్ **డిసెంబర్ 6(జర్నలిస్ట్ వార్త):**
హైదరాబాద్ నగరంలోని పారిశ్రామిక భూములను ఇతర అవసరాలకు కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన హిల్ట్ (హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ లైఫ్‌స్టైల్ టౌన్‌షిప్) పాలసీపై మధ్యంతర ఉత్తర్వులు (స్టే) ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. ఇది కేవలం విధానపరమైన ప్రకటన మాత్రమేనని, ఇంకా ఎలాంటి చర్యలు ప్రారంభించలేదని అడ్వకేట్ జనరల్ (ఏజీ) సుదర్శన్ రెడ్డి కోర్టుకు వివరించడంతో ధర్మాసనం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. హిల్ట్ పాలసీపై కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేస్తూ, తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది.ప్రభుత్వం నవంబర్ 22న జారీ చేసిన జీవో 27 హెచ్ఎండీఏ చట్టానికి, మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధంగా ఉందని ఆరోపిస్తూ ప్రొఫెసర్ కె. పురుషోత్తంరెడ్డి, ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కె.ఎ.పాల్ వేర్వేరుగా ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ శ్యాంకోసీ, జస్టిస్ చలపతిరావులతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది కె. వివేక్‌రెడ్డి వాదిస్తూ, పారిశ్రామిక భూములను నివాస, వాణిజ్య సముదాయాలకు కేటాయించడం నిబంధనలకు విరుద్ధమన్నారు. దీనిపై స్టే విధించకపోతే ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.అయితే, అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి ఈ వాదనలను తీవ్రంగా వ్యతిరేకించారు. హైదరాబాద్‌ను "గ్రీన్ సిటీ"గా మార్చే లక్ష్యంతోనే కాలుష్య పరిశ్రమలను నగరం వెలుపలికి తరలించేందుకు ఈ పాలసీని తెచ్చామని తెలిపారు. బాలానగర్, కూకట్‌పల్లి, కాటేదాన్ ప్రాంతాల్లో కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇది కేవలం విధానపరమైన నిర్ణయమని, హెచ్ఎండీఏ చట్టం ప్రకారమే ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించి, మాస్టర్ ప్లాన్‌ను సవరిస్తామని, అందుకు ఇంకా సమయం ఉందని స్పష్టం చేశారు. ఏజీ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం, మధ్యంతర ఉత్తర్వులకు నిరాకరిస్తూ విచారణను వాయిదా వేసింది.

# కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా కేంద్రంపై పోరాడుదాం

(మొదటి పేజి తరువాయి)
సోనియా గాంధీ ఢిల్లీలో వ్యతిరేకించిన బిల్లును, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా అమలు చేస్తుందని కేటీఆర్ ప్రశ్నించారు. ఇక్కడి నుంచే పోరాటాన్ని మొదలుపెడదామని పిలుపునిచ్చారు. ఢిల్లీలో కేంద్ర కార్మిక మంత్రిని, పార్లమెంటు స్టాండింగ్ కమిటీ సభ్యులను కలుద్దామని.. లేబర్ కోడ్‌ల అమలు ఆపేదాకా అసెంబ్లీ, మండలి సమావేశాలు స్తంభింపజేస్తామని అన్నారు. దీనిపై వరంగల్‌లో తదుపరి రౌండ్ టేబుల్ మీటింగ్ నిర్వహిస్తామని తెలిపారు. దేశంలో 92శాతం మందికి తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయని తెలిపారు. సిరిసిల్ల చేనేత కార్మికులను ఆదుకునేందుకు పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రూ.3,500 కోట్ల మేర బతుకమ్మ చీరల తయారీకి కేసీఆర్ ఆర్డర్ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే, కొందరు పిచ్చోళ్లు తెలియక ఏదేదో మాట్లాడుతున్నారని విమర్శలు గుప్పించారు. తాము ప్రతిపక్షంలో ఉన్నా నేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటే కేసీఆర్ చలించిపోయి పార్టీ తరఫున ఆర్థిక సాయం చేశారన్నారు. కనీసం పాలకుల్లో చలనమైనా వస్తుందని కేసీఆర్ సాయం చేశారని చెప్పుకొచ్చారు. నాలుగు దశాబ్దాల క్రితం చైనా జీడీపీ మనకన్నా తక్కువగా ఉండేదని, ఇప్పుడు మనది నాలుగు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ అయితే, చైనాది అరవై ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థని కేటీఆర్ తెలిపారు. చైనా ఎప్పటికప్పుడు ప్రజలకు అనుగుణంగా నూతన విధానాలు తీసుకురాబట్టే ఫలితాలు సాధించిందన్నారు. అన్నింటికీ ముందు.. పోరాడే పార్టీకి పార్లమెంట్‌లో తగిన సీట్లు ఇవ్వడమే కారణమన్నారు. లోక్‌సభలో బీఆర్ఎస్‌కు ప్రాతినిధ్యం లేకపోవడం వల్ల కాంగ్రెస్, బీజేపీలు కలిసి ఇలాంటి చట్టాలను తెస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోనోపోలీ వల్ల ఎలాంటి అనర్థం జరుగుతుందోనన్నారు. ఇండిగో విమానయాన సంస్థ వల్ల ప్రయాణికులకు ఐదు రోజులుగా జరిగిన అసౌకర్యం ప్రత్యక్ష ఉదాహరణ అని పేర్కొన్నారు. ఐదు రోజుల్లో వెయ్యి విమానాలు రద్దయ్యాయన్నారు. కేంద్ర ప్రభుత్వం.. పోర్టులు, ఎయిర్ పోర్టులు, ఇతర మౌలిక సదుపాయాల సంస్థలు కొంతమంది చేతుల్లో పెట్టడం వల్ల ఇలాంటి ఉపద్రవాలు వస్తున్నాయని అన్నారు. శ్రమదోపిడీ వల్లే ఇదంతా జరిగిందని మండిపడ్డారు. ఇండిగో ఒత్తిడికి కేంద్రమే తలొగ్గింది తప్ప, ఇండిగో తగ్గలేదన్నారు.కేంద్రం ఐదు రోజుల తర్వాత స్పందించడం వల్ల ఎయిర్ పోర్టులు బస్ స్టేషన్లు, రైల్వేస్టేషన్లుగా మారాయన్నారు. కొత్త లేబర్ కోడ్‌లు అమల్లోకి వస్తే ఇండిగో వల్ల జరిగిన అసౌకర్యం మిగతా రంగాలకు విస్తరిస్తుందని, ఇప్పుడు ఏ ఎన్నికలు లేవని, బీఆర్‌టీయూ ఎవరితోనైనా పని చేయొచ్చని వివరించారు. లేబర్ కోడ్‌లు రాష్ట్రంలో అమలు చేయకుండా అడ్డుకుంటే దేశానికి దిక్సూచి అవుతుందన్నారు. లేబర్ కోడ్‌ల అమలు ఆపేదాకా అసెంబ్లీ, మండలి సమావేశాలు స్తంభింపజేస్తామని పిలుపునిచ్చారు. వరంగల్‌లో తదుపరి రౌండ్ టేబుల్ మీటింగ్ నిర్వహిస్తామని మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు

# రూపాయి పతనం పూర్తిగా ప్రతికూలం కాదు

## ఎగుమతిదారులకు ప్రయోజనకరమేనన్న నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ **డిసెంబర్ 6(జర్నలిస్ట్ వార్త):**
అమెరికా డాలర్ తో పోలిస్తే రూపాయి విలువ రికార్డు స్థాయి కనిష్ఠానికి పడిపోయిన విషయం తెలిసిందే. డాలర్ తో రూపాయి మారకం విలువ ప్రస్తుతం 89.95 గా ఉంది. రెండు రోజుల క్రితం ఈ విలువ 90 కి చేరింది. సమీప భవిష్యత్తులో ఈ మారకం విలువ రూ.91కి చేరుతుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు.ఈ నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తాజాగా ఈ విషయంపై స్పందించారు. రూపాయి పతనం పూర్తిగా ప్రతికూలం కాదని చెప్పారు. హిందుస్థాన్ టైమ్స్ లీడర్ షిప్ సదస్సులో మాట్లాడుతూ.. రూపాయి పతనం వల్ల భారత దేశంలోని ఎగుమతిదారులకు ప్రయోజనకరమేనని మంత్రి అభిప్రాయపడ్డారు.భారత రూపాయి మారకం విలువ ఇటీవల అమెరికన్ డాలర్‌తో పోలిస్తే చారిత్రాత్మక కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఈ డిసెంబర్ 3న రూపాయి రూ. 90.43 వద్ద కనిష్ట స్థాయిని తాకింది. రూపాయి బలహీనపడటం వల్ల దిగుమతులు ఖరీదైనవిగా మారతాయి, ఇది ద్రవ్యోల్బణాన్ని పెంచుతుంది మరియు విదేశాలలో చదువుతున్న విద్యార్థులు, అంతర్జాతీయ ప్రయాణికుల బడ్జెట్‌లపై ప్రభావం చూపుతుంది. అయితే, బలహీనమైన రూపాయి భారతీయ ఎగుమతిదారులకు ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉంది. ఎందుకంటే వారి ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లలో చౌకగా మారతాయి.

# ఏపీలోని పట్టణాలకు రూ. 281 కోట్లు..

## ఏపీలోని పట్టణాలకు 15వ ఆర్థిక సంఘం నిధులు

అమరావతి, **డిసెంబర్ 6(జర్నలిస్ట్ వార్త):**
ఆంధ్రప్రదేశ్‌లోని పట్టణాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదలయ్యాయి. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు, పది లక్షల లోపు జనాభా ఉన్న (నాన్-మిలియన్ ప్లస్) నగరాలకు రెండో విడత గ్రాంట్‌గా రూ. 281.89 కోట్లను కేంద్రం మంజూరు చేసింది. ఈ నిధుల వినియోగానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు (జీవో) జారీ చేసింది.ఈ నిధులను ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం వినియోగించనున్నారు. ముఖ్యంగా రోడ్లు, వీధి దీపాలు, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా వంటి ప్రాథమిక అవసరాల మెరుగుదలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. విడుదలైన నిధులను "టైడ్" మరియు "అన్-టైడ్" గ్రాంట్ల రూపంలో కేటాయించారు.
ఈ విధానం వల్ల ప్రతి పట్టణం తమ స్థానిక అవసరాలకు అనుగుణంగా నిధులను ఖర్చు చేసుకునేందుకు వెసులుబాటు కలుగుతుంది. ఏయే పనులకు ఎంత మొత్తం కేటాయించాలనేది స్థానిక పరిస్థితులను బట్టి నిర్ణయిస్తారు. ఈ నిధుల విడుదలతో రాష్ట్రంలోని చిన్న, మధ్య తరహా పట్టణాల్లో అభివృద్ధి పనులు మరింత వేగవంతం కానున్నాయి. ప్రభుత్వం జీవో జారీ చేయడంతో నిధుల వినియోగానికి మార్గం సుగమమైంది.

# ఎస్ఎల్‌బీసీ పూర్తి చేసి నల్గొండ జిల్లాకు నీరు అందిస్తాం

(మొదటి పేజి తరువాయి)
ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గంలో రూ.23 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. పోరాటాల పౌరుషం ఉన్న గడ్డ నల్గొండ. నిజాం నిరంకుశ పాలనను ఎదురించిన జిల్లా నల్గొండ. ప్రజా ప్రభుత్వానికి అండగా నిలిచిన అందరికీ ధన్యవాదాలు అని తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్ల పాటు పేదలకు ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొత్త రేషన్ కార్డులు ఇచ్చింది. రేషన్ కార్డులపై దొడ్డు బియ్యం రద్దు చేసి సన్నబియ్యం ఇస్తున్నాం. పేదల ఆకలి తీర్చినప్పుడే నిజమైన ఇందిరమ్మ రాజ్యం అని మన ప్రభుత్వం సంపూర్ణంగా విశ్వసిస్తోంది. దేశంలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే. గుజరాత్ సహా దేశంలో మరే రాష్ట్రంలోనూ సన్న బియ్యం ఇవ్వట్లేదు. యూపీఏ ప్రభుత్వ హయాములో రాష్ట్రంలో 25లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరిగింది. గత పదేళ్లలో ఎంతమంది పేదలకు ఇళ్లు ఇచ్చారో కేసీఆర్ చెప్పాలి. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే 4.50లక్షల ఇళ్లు పేదలకు మంజూరు చేశాం. లంబాడీలకు ఎస్టీ రిజర్వేషన్లు కల్పించిందే ఇందిరమ్మ ప్రభుత్వం.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే 25లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసింది. ఒకే విడతలో రూ.2లక్షల చొప్పున రూ.21వేల కోట్లను రైతుల ఖాతాల్లో వేశాం. రుణమాఫీ పేరిట పదేళ్లపాటు రైతులను కేసీఆర్ మోసం చేశారు. గతంలో మంత్రులు, ఎమ్మెల్యేలను కూడా కేసీఆర్ కలిసేవారు కాదు. ప్రగతి భవన్, ఫామ్‌హౌజ్‌లోకి ఎవ్వరినీ రానివ్వలేదు. కానీ, నిన్న ఇద్దరు సర్పంచ్‌లను కూర్చోబెట్టుకుని మళ్లీ మనకు మంచి రోజులు వస్తాయని చెబుతున్నారు. కేసీఆర్ ఓడిపోయాకే రాష్ట్రానికి, ప్రజలకు మేలు జరుగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును కేసీఆర్ పదేళ్లపాటు పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వ హయాంలోనే ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పూర్తి చేస్తాం. ఎస్ఎల్‌బీసీ పనులు ప్రారంభించగానే సొరంగంలో దురదృష్టవశాత్తూ ప్రమాదం జరిగింది. సొరంగంలో ప్రమాదం జరిగితే భారత రాష్ట్ర సమితి నేతలు సంబరపడ్డారు. ఏదేమైనా టన్నెల్‌ను పూర్తి చేసి నీరు అందిస్తాం' అని సీఎం అన్నారు. తమ ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్లుగా పాలన సాగుతోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజాపాలన రెండేళ్లు పూర్తిచేసుకుంటున్నామని పేర్కొన్నారు. నిజాంలు, రజాకార్లను తరిమికొట్టిన ప్రాంతం నల్గొండ అని చెప్పుకొచ్చారు. గడీల పాలనను ప్రజలు తరిమికొట్టారని ప్రస్తావించారు. కేసీఆర్ హయాంలో పేదలకు రేషన్ కార్డులు ఇవ్వాలనే ఆలోచనే చేయలేదని విమర్శించారు. పేదలందరికీ తమ ప్రభుత్వంలో రేషన్ కార్డులు ఇచ్చామని స్పష్టం చేశారు. పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని పేర్కొన్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం భారీ బహిరంగ సభలో ప్రసంగించారు సీఎం రేవంత్‌రెడ్డి. 'కేసీఆర్ హయాంలో పేదలకు దొడ్డుబియ్యం ఇచ్చారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ సన్నబియ్యం ఇవ్వట్లేదు. మా హయాంలో సన్నబియ్యం సరఫరా చేస్తున్నాం. పేదల ఆకలి తీర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం. డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తానని మాట ఇచ్చి కేసీఆర్ మోసం చేశారు. యూపీఏ హయాంలో తెలంగాణలో 25 లక్షల ఇళ్లు మంజూరు చేశారు. ఇప్పుడు తెలంగాణలో 4 లక్షలకు పైగా ఇళ్లు కడుతున్నాం. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఎన్ని ఇళ్లు ఇచ్చారో చెప్పాలి. కాంగ్రెస్ పాలనలో పేదలకు న్యాయం జరుగుతుంది. కాంగ్రెస్ గెలిస్తే కరెంట్ ఉండదన్నారు. 24 గంటలపాటు ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత మాదే. ఉచిత కరెంట్ పేటెంట్ కాంగ్రెస్‌దే. పేదలంటే కేసీఆర్‌కు ఇష్టం ఉండదు. రైతులను కేసీఆర్ మోసం చేశారు' అని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. 'మంచిరోజులు వస్తాయని కేసీఆర్ అంటున్నారు.

# తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం..

## ఐదుగురు ఏపీ భక్తుల మృతి

అమరావతి, **డిసెంబర్ 6 (జర్నలిస్టు జర్నీ న్యూస్)** తమిళనాడులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఐదు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఐదుగురు అయ్యప్ప భక్తులు ఈ ప్రమాదంలో దుర్మరణం చెందారు. రామనాథపురం జిల్లా సమీపంలో వీరు ప్రయాణిస్తున్న కారును మరో కారు బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. ఏపీకి చెందిన అయ్యప్ప భక్తులు రామేశ్వరం దర్శించుకుని తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. రామనాథపురం జిల్లా కీజక్కరై వద్ద వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని ఎదురుగా వస్తున్న మరో కారు వేగంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు రెండు కార్లు నుజ్జునుజ్జయ్యాయి. సమాచారం ప్రకారం, కారులో ఉన్న ఐదుగురు భక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న కీజక్కరై పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టి, గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. మృతులను విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం కోరపు కొత్తవలస, గజపతినగరం మండలం మరుపల్లి గ్రామ వాసులుగా గుర్తించారు.

# వైజాగ్ వన్డేలో టీమిండియా ఘన విజయం...

**డిసెంబర్ 6 డిసెంబర్ 6(జర్నలిస్ట్ వార్త):**
దక్షిణాఫ్రికాతో జరిగిన నిర్ణయాత్మక మూడో వన్డేలో టీమిండియా జయభేరి మోగించింది. విశాఖపట్నం ఏసీఏ-వీడీసీఏ స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో 9 వికెట్ల తేడాతో సఫారీ జట్టును చిత్తు చేసి, మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-1 తేడాతో కైవసం చేసుకుంది. ఈ సిరీస్‌లో తొలి వన్డేలో భారత్ నెగ్గగా, రెండో వన్డేలో దక్షిణాఫ్రికా గెలిచింది. దీంతో ఇరు జట్లకు కీలకంగా మారిన ఆఖరి మ్యాచ్‌లో భారత్ సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించింది.271 పరుగుల లక్ష్యఛేదనలో బరిలోకి దిగిన భారత్‌కు ఓపెనర్లు యశస్వి జైస్వాల్, రోహిత్ శర్మ అద్భుతమైన శుభారంభాన్ని అందించారు. రోహిత్ శర్మ (75) దూకుడుగా ఆడగా, యశస్వి జైస్వాల్ (116 నాటౌట్) అజేయ సెంచరీతో కదం తొక్కాడు. జైస్వాల్ స్కోరులో 12 ఫోర్లు, 2 సిక్సులు ఉన్నాయి. రోహిత్ ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన విరాట్ కోహ్లీ (45 బంతుల్లో 65 నాటౌట్) కూడా మెరుపు ఇన్నింగ్స్ ఆడటంతో భారత్ 39.5 ఓవర్లలో కేవలం ఒక వికెట్ మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించింది.అంతకుముందు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత్, దక్షిణాఫ్రికాను 47.5 ఓవర్లలో 270 పరుగులకు ఆలౌట్ చేసింది. సఫారీ జట్టులో ఓపెనర్ క్వింటన్ డి కాక్ (106) సెంచరీతో ఒంటరి పోరాటం చేశాడు. కెప్టెన్ బవుమా (48) ఫర్వాలేదనిపించినా, మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ చెరో నాలుగు వికెట్లతో సఫారీ పతనాన్ని శాసించారు. అర్షదీప్ సింగ్, రవీంద్ర జడేజా చెరో వికెట్ పడగొట్టారు.

# గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్ల పరిశీలన

(మొదటి పేజి తరువాయి)
రంగారెడ్డి జిల్లా కందుకూర్ మండలం ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 8,9 వ తేదీల్లో రైజింగ్ గ్లోబల్ సమిట్ జరగనుంది. తెలంగాణను ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చడంతో పాటు రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను అంతర్జాతీయ స్థాయిలో పెంచడమే లక్ష్యంగా ఈ సదస్సును తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. డిసెంబర్ 8 మధ్యాహ్నం ఒంటి గంటకు గ్లోబల్ సమ్మిట్ ను గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రారంభించనున్నారు. తొలి రోజు ముఖ్యమంత్రి, మంత్రుల ప్రసంగాలు ఉంటాయి. మొత్తం 27 సెషన్లు ఉంటాయి. డిసెంబర్ 8న మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు ప్రసంగాలు ఉంటాయి. మధ్యాహ్నం 2.30గంటలకు రేవంత్ ప్రసంగించనున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి పలు రంగాలపై చర్చ జరుగుతుంది. 3 గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్ రంగంపై చర్చ ఉంటుంది. సెమీకండక్టర్లు, గ్రీన్ ఎర్జీ , ఎరోస్పేస్ ఎడ్యుకేషన్ పై చర్చ జరుగుతుంది. సాయంత్రం 6గంటలకు సమ్మిట్ ముగుస్తుంది. డిసెంబర్ 9వ తేదీ ఉదయం 10 గంటలకు సమ్మిట్ ప్రారంభం అవుతుంది. సాయంత్రం 6 గంటలకు ముగుస్తుంది.
---------

# సాగు విస్తీర్ణం ఆధారంగా యూరియా పంపిణీ!

(మొదటి పేజి తరువాయి)
యూరియా కొరతపై ఇటు విపక్షాల నుంచే కాక ప్రజలు కూడా ప్రభుత్వం మీద తీవ్ర స్థాయిలో అసహనం వ్యక్తం చేశారు. ఇక విపక్షాలు అయితే ప్రభుత్వ అసమర్థత వల్లే కేంద్రం రాష్ట్రానికి సరిపడా యూరియాను సరఫరా చేయలేదని దుమ్మెత్తిపోశాయి. ఈ క్రమంలో యాసంగి సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈసారి యూరియా కొరత లేకుండా, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు గాను తెలంగాణ వ్యవసాయ శాఖ కఠిన చర్యలు తీసుకోవడానికి రెడీ అవుతోంది. దీనిలో భాగంగా ఈ సారి నుంచి సాగు విస్తీర్ణం ప్రకరమే యూరియా పంపిణీ చేయనున్నారు. అంటే రైతులు ఎన్ని ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు అనే వివరాల ఆధారంగానే యూరియా పంపిణీ జరగబోతుంది. దీనికోసం రైతుల పట్టాదారు పాస్‌బుక్కుల నుంచి వివరాలు సేకరించి.. ఎంత యూరియా అవసరమో లెక్కలు తేల్చేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. రైతులు తాము సాగు చేసే పొలం విస్తీర్ణం కంటే ఎక్కువ యూరియా తీసుకోకుండా ప్రత్యేక యాప్‌ని అభివృద్ధి చేస్తున్నారు. గత నెల నుంచి ఆధార్ లింకుతో ఈ-పాస్ యంత్రాల ద్వారా యూరియా, ఇతర మందుల అమ్మకాలు జరుగుతున్నాయి. రైతుకు ఉన్న భూమికి ఎంత యూరియా అవసరమో అంతే తీసుకునేలా చర్యలు చేపట్టారు. దీని వల్ల.. అధికారులను తప్పుదోవ పట్టించి బ్లాక్‌లో అమ్మడం కోసం.. ఎక్కువ యూరియా తీసుకుంటే దొరికిపోతారు. దీని వల్ల బ్లాక్ మార్కెట్‌ను కట్టడి చేయవచ్చని భావిస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఈ సీజన్‌కు 10.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అవసరమని కేంద్రానికి లేఖ రాసింది. ఈ నెలాఖరు వరకు నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాలని కోరింది. అయితే, ఇప్పటివరకు రెండు నెలలకు సంబంధించిన యూరియా నిల్వల్లో సగం మాత్రమే రాష్ట్రానికి వచ్చిందని వ్యవసాయ శాఖ తెలిపింది. అక్టోబర్‌కు సంబంధించి 37 వేల మెట్రిక్ టన్నులు, నవంబర్ నెలకు సంబంధించిన 25 వేల మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి చేరింది.

# మహానటి సావిత్రికి మరణం లేదు



ఈ కార్యక్రమానికి మంచి పేరు పెట్టారు. సావిత్రి జీవితం నుంచి ఎన్నో విషయాలు నేటితరం నేర్చుకోవచ్చు. నటిగా ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ సమాజ శ్రేయస్సు కోసం ఆమె పాటుపడ్డారు. కంటితో కోటి భావాలు, నవరసాలు పలికించే ఆమె నటన అద్భుతం అన్నారు. ప్రస్తుతం అలాంటి నటీమణులు లేరు. ఈ విషయం చెప్పడానికి నాకు ఏ సంకోచం లేదు. నేటి సినిమాల్లో కథానాయికకు ప్రాధాన్యం తగ్గిపోతోంది. కుటుంబ విలువలు ఉన్న సినిమాలు రావడం లేదు. అభినయం ప్రదర్శించే కథానాయికలను వేళ్ల మీద లెక్క పెట్టి చెప్పవచ్చు. ప్రస్తుతం ఒకరిద్దరు అలాంటి నటీమణులు ఉన్నా, వారికి తగిన అవకాశాలు రావడం లేదు. సినీ ప్రముఖులు ఈ దిశగా ఆలోచించాలని వెంకయ్యనాయుడు సూచించారు. అలాగే మంచి సినిమా తీస్తే తనతో సహా అందరూ ఆదరిస్తారని, ఈ ప్రపంచంలోనే అత్యంత చవకైన వినోదం సినిమా మాత్రమేనని వెంకయ్యనాయుడు అన్నారు. తెలుగు సాహిత్యంలో ఉన్న ఎన్నో కథలను దర్శక-నిర్మాతలు ధారావాహికల రూపంలో నేటి తరానికి అందించాలని కోరారు. ఈటీవీ విన్ 'కథాసుధ' పేరుతో చేస్తున్న ప్రయత్నాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. సినిమా వ్యాపారమే అయినా, అది కళాత్మకమని నిర్మాతలు గుర్తు పెట్టుకోవాలన్నారు.. 'మహానటి' మూవీని అద్భుతంగా తీశారు. అశ్వనీదత్ కుమార్తెలు, ఆయన అల్లుడు నాగ్ అశ్విన్‌కు నా అభినందనలు. ఆ సినిమా చూస్తుంటే పాత రోజులన్నీ గుర్తు వస్తాయి. ప్రతి నిర్మాత ఇలాగే ఆలోచించాలి. మనవైన కథలు ఎన్నో ఉన్నాయి. మంచి సినిమా ఉంటే నాతో సహా అందరూ చూస్తారు. దగ్గుబాటి రానా నిర్మించిన '35: చిన్న కథ కాదు', దిల్‌రాజు కుమార్తె హన్షిత నిర్మించిన 'బలగం', కొణిదెల నిహారిక 'కమిటీ కుర్రాళ్లు', సుకుమార్ కుమార్తె సుప్రీతి 'గాంధీతాత చెట్టు' ఇలా ఎన్నో చిత్రాలు ప్రేక్షకుల అభిమానం సొంతం చేసుకోవడంతో పాటు, అవార్డులు సొంతం చేసుకున్నాయన్నారు.
మన జీవనంలో అత్యంత చౌకగా లభించే వినోదం సినిమా. అప్పటి సినిమాల్లో హీరో-హీరోయిన్ ఒకరినొకరు తాకకుండా శృంగారాన్ని పండించేవారు. ఇప్పుడు తాకిన, గోకినా ఏం జరగడం లేదు. అంత తేడా వచ్చేసింది. సావిత్రిలాంటి నటికి మరణం లేదు. ఆమె మంచితనం కూడా చిర యశస్సు అందించింది. సినిమా వినోదం పాటు, సందేశానికీ ప్రాముఖ్యత ఇవ్వాలి. సందేశాత్మక సినిమాలు ఎవరు చూస్తారని అందరూ అనుకుంటున్నారు. రామోజీరావుగారు తీసిన సందేశాత్మక సినిమాలు ఆడలేదా? నేటి దర్శక-నిర్మాతలు ఆ అభిప్రాయాన్ని మార్చుకుని, కళాత్మక సినిమా తీయాలని కోరుకుంటున్నాఅని వెంకయ్యనాయుడు కోరారు. ఈ కార్యక్రమంలో తనికెళ్ల భరణి తదితర నటులు, సావిత్రి కూతురు విజయచాముండేశ్వరి పాల్గొన్నారు.

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త తెలుగు దిన పత్రిక
ఆదివారం 7 డిసెంబర్ 2025

# మీ ఇంటి బిడ్డగా నన్ను ఆశీర్వదించండి..

**- 24 గంటలు అందుబాటులో ఉండే నాయకున్ని.**

**- 27 ఏళ్ల రాజకీయ జీవితం. - బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి జక్రి నరేందర్.**



**రుద్రూర్/డిసెంబర్6(జర్నలిస్ట్ వార్త):** ప్రజా సమస్యలపై నిర్విరామంగా పోరాటాలు చేసిన వ్యక్తిగా తనను ఆశీర్వదించి ఆదరించాలని హ్యాండ్ బ్యాగు గుర్తుకు ఓటు వేసి గ్రామ అభివృద్ధికి సహకరించాలని రుద్రూర్ మండలంలోని అంబం (ఆర్) గ్రామ సర్పంచ్ అభ్యర్థి జక్రి నరేందర్ పేర్కొన్నారు. గ్రామంలోని పలు కాలనీలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో ప్రధానంగా ఉన్నటువంటి పలు సమస్యలను పరిష్కరించే దిశగా చరవ తీసుకుంటానన్నారు. తనను అంబం ఆర్ గ్రామ సర్పంచ్ గా గ్రామ ప్రజలందరికీ ఉచితంగా ఐదేళ్లపాటు మినరల్ వాటర్ అందిస్తానని హామీ ఇస్తున్నట్లు ఆయన మీడియాకు తెలిపారు. గత బిఆర్ఎస్ హయాంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు రావలసిన ఇల్లా బిల్లులు ప్రభుత్వం మారడంతో ఆగిపోయాయని, చాలామందికి డబుల్ బెడ్ రూమ్ బిల్లులు రాక వారు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్న తరుణంలో వాటి బిల్లుల మంజూరుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. గత 27 ఏళ్లుగా ప్రజా నాయకుడిగా మీ ఇంటి బిడ్డగా తన జీవితమంతా ప్రజల కోసమే పని చేశానని మీ ఇంటి బిడ్డగా ఆశీర్వదించాలని మహిళలకు, గ్రామ పెద్దలకు, యువకులకు, అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ పదవి లేకున్న పలు విధాలుగా సేవలు చేశామన్నారు. గ్రామ ప్రజలు అందరూ తమ అమూల్యమైన ఓటును జక్రి నరేందర్ సర్పంచ్ అభ్యర్థి హ్యాండ్ బ్యాగు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు.

# రిమోట్ గుర్తుకు ఓటు వేసి గ్రామ అభివృద్ధి కి తోడ్పడండి

**-ఇండిపెండెంట్ సర్పంచ్ అభ్యర్థి పున్న తులసి**



**రుద్రూర్/డిసెంబర్6(జర్నలిస్ట్ వార్త):** రిమోట్ గుర్తుకు ఓటు వేసి గ్రామ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని రుద్రూర్ మండలంలోని అంబం (ఆర్) గ్రామ ఇండిపెండెంట్ సర్పంచ్ అభ్యర్థి పున్న తులసి శ్రీనివాస్ గ్రామ ప్రజలను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నామినేషన్ ప్రక్రియలో సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరితో కలుపుగోలుగా ఉంటూ గ్రామ అభివృద్ధికి దోహదపడతానని తెలిపారు. ఈ సర్పంచ్ ఎన్నికలలో ప్రతి ఒక్కరు రిమోట్ గుర్తుపై ఓటు వేసి తమను గెలిపించాలని గ్రామస్తులను కోరారు. గ్రామంలోని ప్రతి ఒక్కరి కష్టసుఖాలు తనకు తెలుసునని అందరికీ న్యాయం జరిగేలా తన వంతు కృషి చేస్తానని అన్నారు. గ్రామంలో మిగిలిన సిసి రోడ్లు, డ్రైనేజీలు, ఇతర సమస్యలన్నీ పరిష్కరిస్తానని, త్రాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తానని ఓటర్లకు హామీ ఇచ్చారు. గ్రామస్తులందరూ ఈ ఒక్కసారి సర్పంచ్ గా అవకాశం ఇవ్వాలని వారు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తాము ఇంటింటికి వెళ్లే క్రమంలో ఓటర్లు తమను ఎంతగానో ఆదరిస్తున్నారని గెలుపు ధీమా వ్యక్తం చేశారు.

## నాయుడుపేట సర్కిల్లో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కి ఘనమైన నివాళులర్పించిన ఖమ్మం జిల్లా ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి జిల్లా కార్యదర్శి కనకం జనార్ధన్ మాదిగ.

**ఖమ్మంబ్యూరో/డిసెంబర్6 (జర్నలిస్ట్ వార్త):** ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం నాయుడుపేట సర్కిల్ ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర అంబేద్కర్ వర్ధంతి సందరరేగా. ఘనమైన నివాళు లర్పించిన ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి నాయకులు ఈ కార్యక్రమంలో ఖమ్మం రూరల్ మండల అధ్యక్షుడు సిరిపురం బొందయ్య మాదిగ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఖమ్మం జిల్లా ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి కార్యదర్శి మండల ఇన్చార్జి కనకం జనార్ధన మాదిగ మాట్లాడుతూ భారతదేశానికి స్వతంత్రం వచ్చే 78 సంవత్సరాలైనా కూడా భారత దేశ రాజ్యాంగంలో ఉన్న ఆర్థిక ఫలాలు గానీ వారికున్న చట్టాలు గాని ఇంతవరకు ఎస్ టి ఎస్ టి బడుగు బలహీన వర్గాల ప్రజల మీద జరుగుతున్న దాడులు గాని వారి స్థితిగతులు గాని అత్యాచారాలు గాని ఆగలేదు అని అన్నారు ఈ కార్యక్రమంలో పాపిట్ల శ్రీను మాదిగ బోయిన కృష? మాదిగ .బోబిళ్ళ నాగరాజు మాదిగ. ప్రభుదాసు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## ఆర్థిక సహాయం అందజేసిన అక్కెనపల్లి స్వర్ణలత బాలరాజు



**స్టేషన్ ఘన్ పూర్/ డిసెంబర్ 6(జర్నలిస్ట్ వార్త) :** మండలంలోని తాటికొండ గ్రామంలో బిఆర్ఎస్ కార్యక ర్త అక్కెనపల్లి హరిబాబు ఇటీవల మృతి చెందడం జరిగింది. విషయం తెలుసుకున్న స్టేషన్ ఘనపూర్ మాజీమార్కెట్ చైర్మన్ అక్కెనపల్లి స్వర్ణలత,బీఆర్ఎస్ జిల్లా నాయకుడు అక్కెనపల్లి బాలరాజు శనివారం గ్రామానికి చేరుకుని తెలంగాణరాష్ట్ర తొలి ఉపముఖ్య మంత్రి, స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటి కొండ రాజయ్య ఆదేశానుసారం బాధిత కుటుంబానికి మనోధైర్యాన్ని అందివ్వడమే ధ్యేయంగా అక్కెనపల్లి హరిబాబుచిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిం చారు. అనంతరం మృతుడి కుటుంబాన్ని పరామర్శిం చి అట్టి కుటుంబానికి 5 వేల రూపాయలు ఆర్థిక సహా యం అందించారు.ఈ కార్యక్రమంలో కుల పెద్దలు అక్కెనపల్లి రాంనర్సయ్య, రాంచంధర్, రాజు,మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి నాయకుడికి నివాళులర్పించిన వాసిరెడ్డి రామనాథం



**మధిర/డిసెంబర్6(జర్నలిస్ట్ వార్త):** మధిర మండలం వంగవీడు గ్రామం ఎస్సి కాలనీకి చెందిన సీనియర్ తెలుగుదేశంపార్టీ నాయకులు దర్శి ఏలయ్య( 65 )శనివారం అనారోగ్యంతో మృతిచెందారు.
ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం మృతిని భౌతికకాయాన్ని యాన్ని దర్శించి టీడీపీ జెండా కప్పి పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చి సంతాప సానుభూతిని తెలియజేసారు.
ఏలయ్య మృతి పార్టీకి తీరని లోటు అని కుటుంబాన్ని పార్టీ ఆదు కుంటుందని రామనాథం అన్నారు. రామనాధంతోపాటు నివాళ్లు అర్పించిన వారిలో ఖమ్మం జిల్లా టీడీపీ మాజీ ఉపాధ్యక్షులు వంగాల రాంకోటి మండల టీడీపీ మరియు గ్రామీణ వైద్య సంఘ నాయకులు గుడిద వెంకటేశ్వర్లు (రమణ టీడీపీ నాయకులు పగిడిపల్లి భద్రయ్య గ్రామశాఖ టీడీపీ అధ్యక్షలు గుడిద కృష్ణ ఉన్నారు


## సర్పంచ్ ఏకగ్రీవమైతే.. ఆ రోజే ఉపసర్పంచ్ ఎన్నిక

**-పోలింగ్ దాకా ఆగొద్దు ఆఫీసర్లకు ఎస్ఈసీ ఆదేశాలు**

**వైరా/ డిసెంబర్6(జర్నలిస్ట్ వార్త):** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు మెంబర్లంతా ఏకగ్రీవమైతే ఉప సర్పంచ్ ఎంపిక కోసం పోలింగ్ తేదీ దాకా ఆగాల్సిన అవసరం లేదు. ఏరోజు ఏకగ్రీవమైనట్లు ప్రకటిస్తారో.. ఆరోజే ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఈ మేరకు అధికారులకు కీలక సర్క్యులర్ జారీ చేసింది. సాధారణంగా పంచాయతీ ఎన్నికల్లో రెండు దశల్లో రిటర్నింగ్ ఆఫీసర్లు ఉంటారు. నామినేషన్ ల ప్రక్రియను స్టేజ్1 ఆఫీసర్ చూస్తే.. పోలింగ్, కౌంటింగ్, ఉప సర్పంచ్ ఎన్నికను స్టేజ్2 ఆఫీసర్ చూస్తారు. ఒక పంచాయతీలో అన్ని స్థానాలు ఏకగ్రీవమైనప్పుడు.. పోటీలో నిలిచిన అభ్యర్థుల జాబితా ప్రకటించిన వెంటనే, ఫలితాలను డిక్లేర్ చేస్తారు. ఇలా డిక్లేర్ చేసిన రోజే.. వెంటనే ఉప సర్పంచ్ ఎన్నికను కూడా పూర్తి చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. అయితే ఏదైనా ఒక్క వార్డులోనైనా పోటీ ఉండి, పోలింగ్ జరగాల్సి వస్తే మాత్రం.. పాత పద్ధతిలోనే పోలింగ్, కౌంటింగ్ పూర్తయ్యాక చివరలో ఉప సర్పంచ్ ఎన్నిక ఉంటుందని ఎస్ఈసీ స్పష్టం చేసింది.

## ప్రతి గ్రామంలో గులాబీ జెండా ఎగరేయ్యండి

**బి ఆర్ ఎస్ నాయకులు**



**ఐనవోలు/డిసెంబర్ 6(జర్నలిస్ట్ వార్త):** ప్రతి గగ్రామంలో గులాబీ జెండా ఎగరేయ్యాలని బి ఆర్ ఎస్ నాయకులు అన్నారు. ఐనవోలు మండల కేంద్రంలో మాజీ మంత్రి వర్ధన్నపేట నియోజకవర్గ ఇంచార్జి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు శనివారం ఐనవోలు మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తంపుల మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చందర్ రావు స్థానిక ఎన్నికల మండల ఇంచార్జ్ రాంమూర్తి పోలపల్లి మండలం లోని గ్రామాల్లోని బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల పేర్లు ప్రకటించారు. పంతిని – కార్మిళ్ల విక్రమ్ రావు, కక్కిరాలపల్లి – బర్ల వాణి రవి కుమార్ , రాంనగర్ – ఈద స్వరూప సుధాకర్, లింగమొరిగూడెం – ఎస్.కె జిందా, ఉడుతగూడెం – తోట హైమావతి రాజేంద్ర ప్రసాద్, నందనం – బరిగెల ఏలియా, ఐనవోలు – గడ్డం రఘు వంశీ, కొండపర్తి – కంజర్ల అశోక్ రావు, వనమాల కనపర్తి – సింగారపు కుమార స్వామి, పున్నేలు – ఎండి ఉస్మాన్ అలీ, పెరమాండ్లగూడెం – దూపెల్లి కొమురయ్య, గర్మిళ్లపల్లి – గబ్బెట స్వరూప కుమార్, వెంకటపురం గుడ్డేటి ఏలియా, ముల్కలగూడెం వలిగే లక్ష్మి లక్మన్ అభ్యర్థులను బీఆర్ఎస్ శ్రేణులు పార్టీ అభిమానులు గ్రామ గ్రామాన ఉన్న ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించి గత 10 ఏండ్లలో కెసిఆర్ గారు చేసిన అభివృద్ధిని సంక్షేమ పథకాలను గుర్తు చేసుకొని అబద్దాలతో అధికారంలోకి వచ్చి గ్రామాలను గాలికి వదిలిన ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గ్రామలే బుద్ధి చెప్పి బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలన్నారు.

# రుద్రూర్ లో పోలీసుల కవాతు

**-స్వేఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి**




**రుద్రూర్/డిసెంబర్6(జర్నలిస్ట్ వార్త):** మండల కేంద్రంతో పాటు సులేమాన్ నగర్ గ్రామంలో శనివారం పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందరరేగా బోధన్ ఏసీపీ శ్రీనివాస్, రుద్రూర్ సీఐ కృష? మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం, పోలీస్ ఉన్నత అధికారుల సూచనల మేరకు గ్రామాల్లో పోలీస్ కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలు సామరస్యంగా, స్నేహపూర్వక వాతావరణంలో నిర్వహించుకోవాలని, ఎన్నికల సమయంలో గుంపులుగా ఉండరాదని సూచించారు. ఎన్నికల నియమావళి పాటిస్తూ, పోటీ చేసే అభ్యర్థులు సహకరించాలని కోరారు. ఎన్నికల ప్రక్రియలో ప్రజలు ధైర్యంగా, ఎలాంటి భయం లేకుండా పాల్గొనాలని ప్రజలకు నమ్మకం కల్పించడం జరిగిందని రుద్రూర్ ఎస్సై సాయన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో విభాగాల పోలీసు బలగాలు పాల్గొన్నాయి.

# సత్తుపల్లి వన్యప్రాణుల అక్రమ వేట కేసులో ప్రధాన నిందితుల అరెస్ట్

**ఖమ్మం జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్, ఐ ఎఫ్ ఎస్**

**ఖమ్మంబ్యూరో/డిసెంబర్6 (జర్నలిస్ట్ వార్త):** జిల్లా అటవీ కాంప్లెక్స్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇటీవల సత్తుపల్లి అర్బన్ పార్క్ పరిధిలో జరిగిన వన్యప్రాణుల అక్రమ వేట కేసు నేపథ్యంలో ఈ కేసు పురోగతిపై ఆయన కీలక వివరాలను వెల్లడించారు.
ఆపరేషన్ వివరాలు అరెస్టులు సుదీర గాలింపు చర్యలు,
నిరంతర నిఘా, ప్రత్యేక బృందాల సమన్వయంతో ఈ కేసులో ప్రధాన నిందితులైన మెచ్చ రాఘు, కుంజా భారత్‌లను అటవీశాఖ%--%జిల్లా టాస్క్ ఫోర్స్ సంయుక్తంగా అరెస్ట్ చేసింది. అరెస్టు అనంతరం నిందితులను సత్తుపల్లి న్యాయస్థానంలో హాజరుపరచగా, మహానీయ న్యాయస్థానం వారిని 16.12.2025 వరకు జ్యుడీషియల్



రిమాండ్‌కు పంపిన్నారు.చట్టపరమైన చర్యలునిందితులపై తెలంగాణ ఫారెస్ట్ యాక్ట్, 1967, వైల్డ్ లైఫ్ (ప్రొటెక్షన్) యాక్ట్ 1972, 1959లలోని సంబంధిత నిబంధనల కింద కఠిన కేసులు నమోదు చేయబడ్డాయని డిఎఫ్ఓ పేర్కొన్నరు.అడవి జంతువుల వేట, వన్యప్రాణుల హానీ, అక్రమ ఆయుధ వినియోగంపై శూన్య సహన విధానంతో కొనసాగుతున్నామని ఆయన వివరించారు. భవిష్యత్తు కార్యాచరణ ఇలాంటి అక్రమ వేట ఘటనలను నిరోధించడానికి జిల్లాలో పహారా వ్యవస్థను బలోపేతం చేయడం, రహస్య సమాచార సేకరణను విస్తరించడం, సున్నిత ప్రాంతాల్లో లక్ష్యిత ప్రత్యేక దాడులు నిర్వహించడం వంటి చర్యలను మరింత దృఢంగా అమలు చేయనున్నట్టు అటవీశాఖ ప్రకటించింది.

**మీడియాకు ధన్యవాదాలు**

“వన్యప్రాణి సంరక్షణ, అటవీ రక్షణ, ప్రజలలో అవగాహన పెంపు కోసం ఖమ్మం అటవీ విభాగం చేపడుతున్న చర్యలను సమాజానికి చేరివేయడంలో మీడియా భూమిక అత్యంత ముఖ్యమైనది. ఖచ్చితమైన సమాచారం, బాధ్యతాయుతమైన ప్రచారం ద్వారా మీరు అందిస్తున్న సహకారం అమూల్యంబీ ఈ మద్దతు ఇదే విధంగా కొనసాగాలని ఆశిస్తున్నాను అని డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ సిద్ధార్థ విక్రమ్ సింగ్, ఐఎఫ్ ఎస్మీడియా సమావేశంలో తెలిపారు.

# మోడీ సహకారం తోనే గ్రామాల సమగ్రాభివృద్ధి

**రాయపర్తి/డిసెంబర్ 6(జర్నలిస్ట్ వార్త):** ప్రధాని నరేంద్ర మోడీ సహాయ సహకారాల తోనే గ్రామాల సమగ్రాభివృద్ధి సాధ్యం అవుతుంది అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగా రాంమోహన్ రెడ్డి తెలిపారు.శనివారం మండలంలో బీజేపీ మండల అధ్యక్షుడు నూనె అనిల్ ఆద్వర్యంలో బీజేపీ సర్పంచ్ అభ్యర్థుల విజయం కోరుతూ పెరికేడు గ్రామంలో బిజెపి అభ్యర్థి అబ్బోబు సుధాకర్, కొండూరు గ్రామంలో వడ్లకొండ రవి,గన్నారం గ్రామంలో ఐత అనూష ల గెలుపు కోరుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు.ఈసందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగా రాం మోహన్ రెడ్డి మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గంలో ఆరు మండలాల్లో 72మందిని సర్పంచ్ అభ్యర్థులు గా ,100మందిని వార్డు సభ్యులు గా నామినేషన్ వేయించడం జరిగింది అని



తెలిపారు.కాంగ్రెస్,బీఆర్ఎస్ పార్టీలకు ధీటుగా బీజేపీ శ్రేణులు క్షేత్ర స్థాయిలో పోరాటం చేస్తున్నామని, బీజేపీ పోటీ వల్ల ఇరు పార్టీలకు ముచ్చెమటలు పడుతున్నాయి అని తెలిపారు.ప్రధాని నరేంద్ర మోడీ అవిశ్రాంతంగా పేదల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారు అని, కేంద్ర ప్రభుత్వం గ్రామాల సమగ్రాభివృద్ధి కోసం డైరెక్ట్ గా గ్రామపంచాయితీల అకౌంట్ లో నిధులు జమ చేస్తూ గ్రామాల సమగ్రాభివృద్ధి కోసం పరితపించే పార్టీ బీజేపీ అని,గ్రామపంచాయితీల అభివృద్ధి కోసం ఒక్క రూపాయి కూడా ఇవ్వని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వారికి నేడు ఓటు అడిగే హక్కు లేదు అని,గ్రామాపంచాయితీ అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడే బీజేపీ కే ఓటు అడిగే హక్కు ఉంది అని తెలిపారు.పాలకుర్తి నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థుల విజయం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.బీజేపీ అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేసి విత్ డ్రా చేసుకోమని కాంగ్రెస్,బీఆర్ఎస్ పార్టీలు రకరకాలుగా ప్రలోభాలకు గురి చేస్తున్నా కూడా బీజేపీ శ్రేణులు ఏమాత్రం ప్రలోభాలకు లొంగకుండా నీతి నిజాయితీ నిబద్దత కలిగి గ్రామాల సమగ్రాభివృద్ధి కి కట్టుబడి ఉండి ధైర్యంగా పోరాడుతున్నారు అని వారికి అన్ని విధాలా పూర్తి సహాయ సహకారాలు అందజేస్తూ అండగా ఉంటాం అని తెలిపారు.ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు పల్లె కుమార్, జిల్లా నాయకులు వడ్లకొండ రవి,మండల ప్రధాన కార్యదర్శి నిమ్మల అనిల్,బీజేవైఎం మండల అధ్యక్షుడు మంచాల సుమన్, రవీందర్ రావు,జక్కుల సందీప్ అబ్బరబోయిన ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకం

## జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డాక్టర్ సత్య శారద.

**రాయపర్తి/డిసెంబర్ 6(జర్నలిస్ట్ వార్త):** రెండవ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకమని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో పిఓలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎన్నికల పోలింగ్ పక్కద్బందీగా నిర్వహణకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి మొదటి విడతలో గల మూడు మండలాలైన వర్ధన్నపేట, పర్వతగిరి, రాయపర్తి లలో ఈనెల 11వ తేదీన జరుగనున్న పోలింగ్ కు సన్నద్ధం కావాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో అనేక దశల్లో అధికారులు పనిచేసిన క్షేత్రస్థాయిలో



ఎన్నికల నిర్వహణలో కీలక పాత్ర ప్రిసైడింగ్ అధికారులదేనని చెప్పారు. కేటాయించిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు ప్రిసైడింగ్ అధికారులు తప్పకుండా సమయానికి హాజరై సంబంధిత గ్రామపంచాయతీకి సంబంధించిన స్టేజ్ 2 రిటర్నింగ్ అధికారులను సంప్రదించాలన్నారు. వారికి కేటాయించిన ఎన్నికల సామాగ్రిని సక్రమంగా తనిఖీ చేసి బ్యాలెట్ పేపర్లలో తమ ప్రిసైడింగ్ స్టేషన్ కు సంబంధించిన వివరాలు సరిగా ఉన్నాయా లేదా పరిశీలించాలని సూచించారు. పోలింగ్ నిర్వహణ, కౌంటింగ్, ఉపసర్పంచ్ ఎన్నిక ధ్రువపత్రాల జారీ వంటి కార్యక్రమాలు అన్ని స్టేజ్ 2 రిటర్నింగ్ అధికారుల పర్యవేక్షణలో ప్రిసైటింగ్ అధికారులు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. తమకు కేటాయించిన పోలింగ్ కేంద్ర పరిధిని గుర్తించడం, అభ్యర్థుల వివరాలను ప్రదర్శించడం, పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల నిర్వహణకు సిద్ధం చేయడం, పూర్తిగా ప్రిసైడింగ్ అధికారుల బాధ్యతేనని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి జడ్పీ సీఈఓ రామిరెడ్డి,ఆర్డీఓ సుమా,ఎంపీడీవో కిషన్, తాహసిల్దార్ శ్రీనివాస్,స్వామి పిఓలు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన టిడిపి నాయకుడు నార పోగు ప్రసాద్



**తల్లాడ/డిసెంబర్6(జర్నలి%ర్% వార్త):** అంబేద్కర్ 70 వర్ధంతి సందర్భంగా శనివారం
టిడిపి నాయకుడు నార పోగు ప్రసాద్ టిడిపి నాయకుడు నార పోగు ప్రసాద్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేశారు. అనంతరం తల్లాడ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నాయకులు నార పోగుప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచం గర్వించదగిన ప్రముఖులలో ముఖ్యుడు మన అంబేద్కర్ అన్నారు. భారతదేశంలో ఉన్న అన్ని రకాల వ్యవస్థలకు రూపకల్పన చేసి మన దేశాన్ని ప్రపంచానికి తెలిసేలా చేసిన మహోన్నత వ్యక్తి మన అంబేద్కర్ అన్నారు.రాజ్యాంగ శిల్పి,ప్రముఖ భారతీయ న్యాయవాది, ఆర్థిక శాస్త్రవేత్త, రాజకీయ నేత, సంఘ సంస్కర్త.ఇతను అంటరానితనం, కుల నిర్మూలన కోసం ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు.స్వాతంత్ర్య భారతదేశపు మొట్టమొదటి కేంద్ర న్యాయశాఖ మంత్రి, భారతరత్న, ఎవరి కుల వృత్తిని వారు అనుసరించడం వల్ల ఎటువంటి పోటీ లేని ఆర్థిక వ్యవస్థ భారత సమాజంలో ఉన్నదని ఆయన సమర్థించాడు.అంటరానివారుగా భావిస్తున్న కులాల వారు తమ ఆత్మగౌరవాన్ని త్యాగం చేస్తూ సమాజం బాగు కోసం తాము చేసే వృత్తులను చేస్తున్నారని, అటువంటి వారిని ఇతర వర్ణముల వారందరూ గౌరవించాలని అన్నారు. తల్లాడ మండలం అంబేద్కర్ యువజన సంఘం నాయకులు పగిడిపల్లి లాజర్, తల్లాడ మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ,గురుకుల హాస్టల్ దళిత వాడలో శుభ్రపరచాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో న్యాయం జరిగేలా ప్రభుత్వాన్ని మంత్రులని కోరారు.

# బీజేపీ ఆధ్వర్యంలో అంబేద్కర్ కు ఘన నివాళి



**స్టేషన్ ఘన్ పూర్, డిసెంబర్ 6(జర్నలిస్ట్ వార్త):** చిల్పూర్ మండలంలోని వంగాలపల్లి, కరుణాపురం నేషనల్ హైవే దగ్గర వంగాలపల్లి గ్రామ బీజేపీ బలపరి చిన సర్పంచ్ అభ్యర్థి కదుగాయ మమత రమేష్ ఆధ్వ ర్యంలో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగానివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా కాదుగాయ మమత మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ అన్ని వర్గాల కోసం, బడుగు బలహీన వర్గాల కోసం రాజ్యాంగాన్ని రాసి రాజ్యాంగ ఫలాలు ప్రతి ఒక్కరు పొందాలని ఆశించారని అన్నారు.రాజ్యాంగం లేకుంటే మనము చాలా బీదరికంలో కష్టంలో ఉండే వాళ్ళం నేను ఈరోజు బిజెపి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానంటే దానికి రాజ్యాంగం యొక్క రిజర్వే షన్ ప్రతిఫలంగానే నాకు ఈ అవకాశం దక్కిందని, రాజ్యాంగం గురించి ఎంత చెప్పినా తక్కువనే అని ఆ మహానీయునికి నివాళులర్పించడం ఎంతో అదృష్టం గా భావిస్తున్నాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జనగాం జిల్లా మీడియా కన్వీనర్ కదుగాయా రమేష్, వంగాలపల్లి మాజీ సర్పంచ్ ప్రణీత ప్రదీప్ కుమార్, ధర్మాపురం వంగాలపల్లి ఆటోడ్రైవర్ యూని యన్ నాయకులు వేణు, సెలూన్ బాబు, శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

# బాల్య మిత్రునికి చేయూతగా 60 వేలు అందజేత




**స్టేషన్ ఘన్ పూర్, డిసెంబర్6 (జర్నలిస్ట్ వార్త),:** మండలంలోని తాటికొండ గ్రామంలో అక్కెనపల్లి హరి బాబు ఇటీవల మృతి చెందడం జరిగింది. శనివారం తాటికొండ గ్రామానికిచెందిన1997%-%98 పదవ తరగతి విద్యార్థులు బాల్యమిత్రుడు అక్కనపల్లి హరిబాబు ఇటీవల అనారోగ్య కారణంగా మరణించిననేపథ్యంలో ఆయన కుటుంబానికి బాల్యమిత్రులు ఆర్థిక సహాయం అందించారు.హరిబాబు అనారోగ్య సమయంలో ఆసుపత్రి ఖర్చులు పెరగడంతో కుటుంబం ఇబ్బందు లు ఎదుర్కొంటున్న విషయంతెలిసిన తోటివిద్యార్థులు ముందుకు వచ్చి 60 వేల రూపాయలు సేకరించారు. సేకరించిన మొత్తాన్ని హరిబాబు తనయుడు అక్కన పల్లి ఉదయ్ చెల్లి పేరుతో ఫిక్స్డ్ డిపాజిట్ రూపంలో 60 వేలు జమ చేసి కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అబ్బాయిలు, అమ్మాయిలు సంతృప్తిక రంగా, తమకు సాధ్యమైనంతగా ఆర్థిక సహకారం అందించారు. ఈ ఉదాత్త కార్యక్రమాన్ని గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో అక్కెనపల్లి రాజేం దర్,రవ్వ సంతోష్, నారబోయిన శ్రీనివాస్, చోక్కం వెంకటేష్, కోరుకొప్పుల మహేందర్, వడ్లకొండ గణేష్, గట్ల మహేందర్ రెడ్డి, పూల గణేష్, భాస్కర్, నలిమెల సురేష్, కుంభోజ్ అశోక్,ఐలోని శ్రీనివాసులు, ఏదునూ రి కుమారస్వామి,మైనంపల్లి భాస్కర్,కూరపాటి రాధా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ల్యాబర్తి గ్రామంలో ఎలక్షన్ సమయంలో

# వెలగని ఐమాక్స్ లైట్స్

## పట్టించుకోని అధికారులు







**వర్ధన్నపేట/డిసెంబర్6(జర్నలిస్ట్ వార్త):**
వర్ధన్నపేట మండలం ల్యాబర్తి గ్రామంలో ఎన్నికల సమయంలోనే ఐమాక్స్ సెంటర్ లైట్ వెలగకపోవడం గ్రామస్థుల్లో ఆందోళన కలిగిస్తోంది. అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామం నడిబొడ్డున చీకట్లు కమ్మేశాయి. ఎలక్షన్ కోడ్ అమల్లో ఉన్న సమయంలో శనివారం సాయంత్రం వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు ప్రచార కార్యక్రమం ముగిసిన కొద్దిసేపటికే లైట్ ఆగిపోవడంతో గ్రామం మొత్తం చీకటిలో మునిగిపోయింది. ప్రజలు పలుమార్లు ఫిర్యాదు చేసినా సంబంధిత శాఖ నుంచి స్పందన లేకపోవడం ప్రజలను మరింత కలవరపరచుతోంది.గ్రామస్థులు వెంటనే లైట్ మరమ్మతులు చేసి సెంటర్ ప్రాంతం వెలుగునింపాలని, ఎలక్షన్ కోడ్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని అధికారులను డిమాండ్ చేస్తున్నారు.

# టూత్‌పేస్ట్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలి

## సర్పంచ్ అభ్యర్థి మర్రిపెల్లి అనిత



**ధర్మసాగర్/హనుమకొండ6 (జర్నలిస్ట్ వార్త):**
ధర్మసాగర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్న మర్రిపెల్లి అనిత శనివారం గ్రామంలో విస్తృత పర్యటన చేశారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజలను కలుసుకుని వారి సమస్యలు, అభిలాషలు వివరంగా తెలుసుకున్నారు. గ్రామ అభివృద్ధి, మహిళా శక్తీకరణ, పారదర్శక పాలన తమ ప్రధాన లక్ష్యాలని అనిత పేర్కొన్నారు. గ్రామంలో తాగునీటి సమస్యలు, కాల్వల మరమ్మత్తులు, వీధి లైట్లు, రహదారుల అభివృద్ధి వంటి అంశాలను ప్రాధాన్యతగా తీసుకుంటానని హామీ ఇచ్చారు. మహిళల ఆత్మనిర్భరత కోసం స్వయం ఉపాధి కార్యక్రమాలను ప్రోత్సహిస్తానని తెలిపారు. గ్రామంలో విద్య, వైద్య సేవలను మెరుగుపరచడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానిక యువతతో సమావేశమై గ్రామ అభివృద్ధికి అవసరమైన సూచనలు స్వీకరించారు. ప్రజల ఆశలు నెరవేర్చే నాయకత్వం అందిస్తానని ధైర్యం చెబుతూ టూత్‌పేస్ట్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని గ్రామస్థులను కోరారు. తన విజయం ధర్మసాగర్ గ్రామ అభివృద్ధికి నాంది అవుతుందన్నారు.

# వర్ధన్నపేట మైనారిటీ పాఠశాలలో సైబర్ నేరాలు మాదక ద్రవ్యాలపై అవగాహన




**వర్ధన్నపేట/డిసెంబర్ 6(జర్నలిస్ట్ వార్త) :** స్థానిక మైనారిటీ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన వర్ధన్నపేట ఎస్సై ఎన్. సాయిబాబు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, డిజిటల్ యుగంలో సైబర్ మోసాలు విపరీతంగా పెరుగుతున్నాయని తెలిపారు. ప్రజల వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ లావాదేవీలను లక్ష్యంగా చేసుకుని నేరగాళ్లు వలలు వేస్తున్నందున అప్రమత్తత తప్పనిసరి అన్నారు. సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, తెలియని లింకులు, అనుమానాస్పద ఈమెయిల్స్ క్లిక్ చేయరాదని హెచ్చరించారు. ఏవైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ లేదా హెల్ప్‌లైన్ 1930 కి కాల్ చేయాలని సూచించారు.
యువత భవిష్యత్తును మాయ చేసే మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, అలాంటి ప్రలోభాలకు లోనుకాకూడదని ఎస్సై సాయిబాబు సలహా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వస్కూరి రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. 100కు పైగా విద్యార్థులు హాజరైన ఈ అవగాహనలో వారికి పలు సూచనలు అందించారు.

# మాజీ ఎమ్మెల్యే మెచ్చ స్వగ్రామం తాటి సుబ్బన్నగూడెంలో సర్పంచ్ ఏకగ్రీవం



**దమ్మపేట/డిసెంబర్6(జర్నలిస్ట్ వార్త):**
దమ్మపేట(మండలం),తాటిసుబ్బన్నగూడెం గ్రామ పంచాయతీ ఎన్నికల వేళ, బీఆర్ఎస్ పార్టీ తమ పట్టును మరోసారినిరూపించుకుంది.
అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎంఎల్ఏ , బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు స్వగ్రామమైన తాటి సుబ్బన్నగూడెంలో సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవమైంది. బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు సవలం స్వాతి ని గ్రామ ప్రజలు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం ద్వారా పార్టీకి ఘన విజయాన్ని అందించారు.

**బీఆర్ఎస్ నాయకత్వంపై అచంచలమైన విశ్వాసం**

ఈ ఏకగ్రీవ ఎంపిక అనేక అంశాలను స్పష్టం చేస్తోంది,మెచ్చా నాగేశ్వరరావు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ హోదా, మరియు ఆయనపై స్వగ్రామ ప్రజలకున్న అపారమైన విశ్వాసాన్ని ఈ ఏకగ్రీవం ప్రతిబింబిస్తుంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ద్వారా జరిగిన అభివృద్ధిని గుర్తించి, గ్రామాన్ని మరింత ముందుకు తీసుకుపోవడానికి అభివృద్ధి వైపు తొలి అడుగుగా ప్రజలు ఏకగ్రీవ పాలనకు పట్టం కట్టారు. పోటీకి తావు లేకుండా, ఐక్యతతో బీఆర్ఎస్ అభ్యర్థిని ఎన్నుకోవడం ఆ ప్రాంతంలో బీఆర్ఎస్ పార్టీకున్న బలమైన క్యాడర్, అసాధారణ పట్టును మరోసారి తెలియజేసింది అని తెలిపారు.

# అభివృద్ధి చేసి చూపిస్తా ఆదరించండి



**రాయపర్తి/డిసెంబర్ 6(జర్నలిస్ట్ వార్త):** జేతురాం తండ గ్రామాన్ని అన్ని రంగాలలో అభివ ృద్ధి చేసి చూపిస్తానని కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి గుగులోత్ స్వప్నవిజయ్ అన్నారు. శనివారం జేతురాం తండ గ్రామంలో ఎన్నికల ప్రచారం లో పాల్గొని ఉంగరం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందరరేగా మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో తనను సర్పంచ్ గా గెలిపిస్తే గ్రామాన్ని అన్ని విధాలా అభివ ృద్ధి చేస్తానని అన్నారు. గత బిఆర్ఎస్ పాలనలో గ్రామం ఎలాంటి అభివ ృద్ధికి నోచుకోలేదని అన్నారు. గ్రామానికి సేవా చేయాలనే ఉద్దేశంతో రాజకీయాలలోకి వచనాన్ని అన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రెడ్డి ల సహకారంతో గ్రామానికి అధిక నిధులు తీసుకువచ్చి గ్రామ అభివ ృద్ధికి పాటుపడుతాని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏకగ్రీవ వార్డు మెంబర్ గుగులోత్ రవి, గుగులోత్ లాలు, నేతావత్ వీరు, జాటోత్ బద్రు, గుగులోత్ సుకుని, గుగులోత్ యాకూబ్, నేతావత్ బద్రు,జాటోత్ వీరన్న, జాటోతు శ్రీను తదితరులు పాల్గొన్నారు

# బీఆర్ఎస్ పార్టీ లో చేరిన కాంగ్రెస్ నాయకులు



**రాయపర్తి/డిసెంబర్ 6(జర్నలిస్ట్ వార్త):** మండలంలోని పానీష్ తండా గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భూక్యా బిక్షపతి, బానోత్ రవి, బానోత్ సంజీవ్, బానోత్ వీర్ కాంగ్రెస్ పార్టీ కి రాజీనామా చేసి శనివారం మాజి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ చేరారు. ఈ సందరరేగా వారికి గులాబీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ సందరరేగా వారికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ఎన్నికల ఇంచార్జి గుడిపూడి గోపాల్ రావు,మండల పార్టీ అధ్యక్షులు మునావత్ నర్సింహా నాయక్, మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్,మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు,మండల పార్టీ నాయకులు చిన్నల లక్ష్మి నారాయణ, చిన్నల శ్రీనివాస్, భూక్య బద్ధు నాయక్,మెరుగు సంతోష్,చందు సతీష్, ప్రశాంత్,తదితరులు పాల్గొన్నారు.

# పాఠాలు నేర్చుకోని కాంగ్రెస్ నేతలు !

**డిసెంబర్ 6(జర్నలిస్ట్ వార్త):** అసమర్థ రాజకీయాల వల్ల ప్రజా సమస్యలపై పోరాడడంలో కాంగ్రెస్ విఫలం అవుతూనే ఉంది. కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలను చేపట్టాక రాహుల్ వైఫల్యం చూశాం. ఆయన ఓ రకంగా పారిపోయాడనే చెప్పాలి. దేశం ఎదుర్కొంటున్న సమస్యలపై స్పష్టమైన అవగాహన లేదు. అందుకే రాహుల్ ఎప్పుడూ విఫల నాయకుడిగానే ఉంటున్నారు. మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలంటే ఓ ఎజెండా ఉండాలి. కానీ రాహుల్‌కు అలాంటిదేమీ లేదని గత పదేళ్లుగా చూస్తూనే ఉన్నాం. ఓట్ చోరీ, గద్దీ చోడ్ అంటూ నినాదాలు, పార్లమెంట్ సమయాన్ని వృధా చేయడం, పేరుకు ఖర్గేను అధ్యక్షుడిని చేయడం వంటివన్నీ పనిచేయవని గుర్తిచడం లేదు. వంశపారంపర్య రాజకీయాలు చేయడం మానుకోవడం లేదు. వారి ఇంటినుంచే ముగ్గురు ఎంపిలో ఉన్నారు. తల్లికొడుకు, కూతురు ఎంపిలు. అల్లుడు రాబర్ట్ వాద్రా కూడా రెడీగా ఉన్నాడు. పాదయాత్ర తప్ప రాహుల్ చేసింది, దేశానికి ఒరగబెట్టిందీ ఏమీ లేదు. గత పదేళ్ల యూపిఎ పాపాలను ప్రజల మరచిపోలేదు. మోడీ పాలనను, మోడీ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడానికి పార్లమెంట్ మంచి వేదిక. అయితే సమస్యలను ఎండగట్టే ప్రయత్నం చేయకుండా కేవలం..రచ్చ చేయడం ద్వారా మాత్రమే కాంగ్రెస్ అధికారంలోకి రావాలని చూస్తోంది. అలా చేసి గత ఎన్నికల్లో ధమాల్ మంది. మరో నాలుగేళ్ల వరకు ఆ అవకాశం లేదు. ఈ లోగా కాంగ్రెస్ అంతర్గత సమస్యలను పరిష్కరించుకోవడం, ప్రజా సమస్యలపై దీర్ఘకాలిక పోరాటం చేయడం విపక్ష నేతగా రాహుల్ పనిచేయాలి. కర్నాటకలో సిఎం కుర్చీ కోసం కుమ్ములాటలు సాగుతున్నాయి. దీనిని సమర్థంగా పరిష్కరించే ధైర్యం రాహుల్‌కు లేదు. ఎందుకంటే కరవమంటే కప్పకు..విడవమంటే పాముకు కోపం అన్నట్లుగా కర్నాటక వ్యవహారం ఉంది. రెండున్నరేళ్లు అయ్యింది కనుక డికె శివకుమార్‌కు ఒప్పందం ప్రకారం సిఎం సీటు అప్పగించాలి. దీనిని కూడా సమర్థంగా నిర్వహించలేక పోతున్నారు. పార్టీ అధిష్ఠానం ఆదేశం మేరకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆ పదవిని ఆశిస్తున్న డీకే శివకుమార్ మధ్య ఇటీవల బ్రేక్ ఫాస్ట్ మీటింగ్‌లు జరిగాయి. అయినంత మాత్రాన సమస్య సమిసిపోదు. ఏం చేయాలో కాంగ్రెస్ అధ్యక్షుడు గా ఉన్న కార్నాటక నేత ఖర్గేకే తెలియదు. సమస్యను పరిష్కరించే సత్తా ఖర్గేకు లేదు. ఇంటిపోరునే పరిష్కరించుకోలేని నేతలు బిజెపిపై వేలెత్తి చూపడం ప్రజలు గమనించడం లేదనుకుంటే ఎలా? వీరి సమర్థత ఎలాంటిదో దీనిని బట్టి తెలుసుకోవచ్చు. కష్టకాలంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని గాడిన పెట్టేందుకు కఠిన నిర్ణయాలు తీసుకోవడానికి పార్టీ




హై కమాండ్ సుముఖంగా లేదు. అంతెందుకు శశిథరూర్ లాంటి వారిని కంట్రోల్ చేసుకునే ధైర్యం లేదు. అంతకుమించి రాజకీయ నైపుణ్యం రాహుల్‌కు లేదు. వందిమాగధులు చెప్పింది విని తలూపే రాహుల్‌కు రాజకీయ నాయకత్వ లక్షణాలు అస్సలు లేవు. అందుకే విఫల విపక్షంగా ఉండడం వల్లనే మోడీ ఓ రకంగా నిరంకుశ నేతగా ఎదిగారని చెప్పాలి. పార్టీలో సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అవసరమైన కఠిన నిర్ణయాలు తీసుకోగల తెగువ, సత్తా పార్టీ నాయకత్వానికి లేవని చెప్పాలి. గత సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ బతికి బట్టకట్టింది. అది కేవలం మోడీపై వ్యతిరేకత కారణంగానే అని చెప్పాలి. ఈ పరిస్థితి కారణంగా రాహుల్‌గాంధీ నాయకత్వం పట్ల ప్రజల్లో నమ్మకం పెరిగిందని చెప్పడానికి లేదు. సొంత పార్టీ నేతల నుంచి ఆదరాభిమానాలు కూడా ఇప్పుడు పెద్దగా దక్కడం లేదు. కర్నాటక, తెలంగాణల్లో స్థానిక పరిస్థితులు, స్థానిక నేతల వ్యూహాలే కాంగ్రెస్‌ను గెలిపించగలిగాయి. భారత రాజ్యాంగ ప్రతిని వెళ్లిన ప్రతిచోటా ఎత్తిచూపుతూ జాతి నిర్మాణానికి అంటూ ఆయన నినాదాలను వల్లె వేసినంత మాత్రాన కాంగ్రెస్ బతికి బట్టకట్టడం జరగదు. అనివార్యంగానే నెహ్రూ కుటుంబంపై ఉన్న ఆదరణతో కాంగ్రెస్ శ్రేణులు రాహుల్ నాయకత్వాన్ని అంగీకరించాయి. కాంగ్రెస్‌కు తిరుగులేని నాయకుడుగా ఆయన ఆవిర్భవించారు. మరి పార్టీపై మరింత పట్టు సాధించేందుకు ఆయన పూనుకున్నారా.. అంటే లేదనే చెప్పాలి. పార్టీ కార్యకలాపాలు అన్నిటినీ స్వయంగా పర్యవేక్షిస్తున్న దాఖలాలు లేవు. పార్టీ సంస్థాగత వ్యవహారాలను చాలావరకు తన విధేయులకు, మరీ ముఖ్యంగా కేసీ వేణుగోపాల్ లాంటి వరికి అప్పగించారు. ఆయన సూచనల మేరకే కర్నాటకలో మొన్న డికె శివకుమార్, సిద్దరమాయ్యలు పరస్పరం అల్పాహార విందు ఇచ్చుకున్నారు. ఇది చల్లారదని తెలుసు. సీటుకోసం పోటీలో సిద్దరామయ్య పట్టువీడడం లేదు. తనకు న్యాయంగా దక్కాల్సిన సిఎం సీటు దక్కలేదన్న ఆగ్రహంతో డికె ఉన్నారు. కర్ణాటక కాంగ్రెస్‌లోని అంతర్గత సమస్యను గట్టిగా పరిష్కరించలేని నాయకుడు రాహుల్. ఇదే పరిస్థితి రేపు తెలంగాణలో కూడా వస్తుంది. అధికారాన్ని నిలబెట్టుకునేందుకు ఒకరు, కైవసం చేసుకునేం దుకు మరొకరు కలహించుకుంటుండం అన్నది కాంగ్రెస్ నైజం. ఏ రాష్ట్రంలో అయినా ఇది పరిపాటిగా వస్తుంది. అందుకే కర్నాటక వ్యవహారంల పార్టీ హై కమాండ్ ఆ ఇద్దరినీ పిలిచి సముదాయించలేక పోతున్నది. దీనికి కారణం కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలో లేకపోవడమే. కాంగ్రెస్ అధికారంలో ఉంటే రాష్ట్రాల్లో రాజకీయాలు నెరపడం సులువు. అటువంటి పరిస్థితులు ఇప్పుడు బొత్తిగా లేవు. అధికారం అన్నది కాంగ్రెస్‌కు చరిత్రగా మారింది. పార్టీలో నాయకుల మధ్య ఘర్షణలను సామరస్య పూర్వకంగా పరిష్కరించగల రాజకీయ సత్తా రాహుల్‌కు లేదు. నాయకత్వ తగాదాలకు పరిష్కారించగలిగే వ్యూహకర్తలు లేరు. గతంలో రాజస్థాన్‌లోనూ, ఛత్తీస్‌గఢ్‌లోనూ ఈ పద్ధతిని అనుసరించేందుకు జరిగిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. పార్టీలో అంతర్గత కలహాలు పెరిగిపోయాయి. ఫలితంగా ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వాలు పరాజయం పాలయ్యాయి. తాజాగా మితిమీరిన ఆత్మవిశ్వాసంతో బీహార్‌లో ఓటమి చవిచూసింది. ఓట్ చోరీ అని ప్రచారం చేసినా ఫలించలేదు. ప్రజల్లో ఉంటూ పోరాటాలు చేయడం నేర్చుకోవాలి. నినాదాలు కాకుండా విధానాలతో ముందుకు సాగాలి. అప్పుడే కాంగ్రెస్ బతికి బట్టకట్టగలదు.

## ఐజేయూ నేతలకు గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఘన సన్మానం



**హనుమకొండబ్యూరో/డిసెంబర్ 6(జర్నలిస్ట్ వార్త):** నూతనంగా ఎంపికైన ఐజేయూ నేషనల్ కౌన్సిల్ సభ్యులు, వరంగల్ జిల్లా అధ్యక్ష%-%కార్యదర్శులను గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ పరిషత్ ఘనంగా సత్కరించింది. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) జాతీయ కౌన్సిల్ మెంబర్లుగా ఎన్నికైన సీనియర్ జర్నలిస్టులు గడ్డం రాజిరెడ్డి, వల్లాల వెంకటరమణ, తోట సుధాకర్, సంగోజు రవిని శాలువాలతో సత్కరించారు. అలాగే టీయుడబ్ల్యూజె (ఐజేయూ) వరంగల్ జిల్లా అధ్యక్షుడు శ్రీరాం రాంచందర్, కార్యదర్శి మట్ట దుర్గాప్రసాద్‌లకు మెమెంటోలు అందించి ఘన సన్మానం చేశారు. యూనియన్‌కు విశేష సేవలందించి నేషనల్ కౌన్సిల్ సభ్యుడిగా పదవీకాలం పూర్తి చేసిన నల్లాల బుచ్చిరెడ్డిని ప్రత్యేకంగా సత్కరించారు.

ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్ష%-%కార్యదర్శులు వేముల నాగరాజు, సదయ్యలు మాట్లాడుతూ యూనియన్ బలోపేతం కోసం కృషి చేస్తున్న నేతలకు పదవులు రావడం గర్వకారణమని తెలిపారు. రాష్ట్రంలో జర్నలిస్టుల అభ్యున్నతి కోసం ఐజేయూ రాష్ట్ర అధ్యక్షుడు కే. విరహత్ అలీ, కార్యదర్శి రాంనారాయణ నాయకత్వంలో టీయుడబ్ల్యూజె (ఐజేయూ)నే నిజమైన రక్షక సంఘమని అభిప్రాయపడ్డారు. ప్రెస్ క్లబ్‌లో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కోశాధికారి బొల్ల అమర్, ఉపాధ్యక్షుడు కొడిపెల్లి దుర్గాప్రసాదరావు, జాయింట్ సెక్రెటరీలు వలిశెట్టి సుధాకర్, పొడిచెట్టి విష్ణువర్ధన్, సభ్యులు ఎండీ నయీంపాషా, విజయరాజ్, ఐజేయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాడిపెల్లి మధు, సభ్యులు కంకణాల సంతోష్, మాజీ అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, నాయకులు సిహెచ్ సోమనర్సయ్య, ఎం.రాజేంద్రప్రసాద్, సంపత్‌రావు, ఉస్మావ్ పాషా, పి. కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పెరుగుతున్న చలి తీవ్రత
## పడిపోతున్న ఉష్ణోగ్రతలు



హైదరాబాద్బాద్, **డిసెంబర్ 6(జర్నలిస్ట్ వార్త):** ఉభయ తెలుగు రాష్ట్రాల్లో క్రమంగా ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి చేరుకుంటున్నాయి. హైదరాబాద్‌లో రాత్రి చలి పెరుగుతోంది. ఉత్తర తెలంగాణ చలిగుప్పిట్లోకి వెళుతున్నది. అటు విశాఖ మన్యంలో కూడా చలి పెరిగింది. వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులతో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోయి చలి తీవ్రత ప్రజలకు వణుకు పుట్టిస్తుంది. ఇప్పుడే చలి తీవ్రత ఇలా ఉంటే.. రాబోయే జనవరి మాసంలో ఎలా ఉండబోతుందోనని జనం బెంబేలెత్తిపోతున్నారు. గత పక్షం రోజులుగా వాతావరణంలో భారీ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు పెరిగిపోయి రాత్రి వేళల్లో చలి తీవ్రత కనిపిస్తుంది. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా గరిష్ఠ ఉష్ణోగ్రత 28.0 డిగ్రీల సెల్సియస్ కాగా కనిష్ఠ ఉష్ణోగ్రత 11.5గా నమోదైంది. ఆదిలాబాద్ రూరల్ పిప్పల్‌ధరిలో 11.1, తలమడుగులో 11.2, బేల మండలం చప్రాలలో 11.7, మావల మండలంలో 11.8, గాదిగూడలో కారికెలో 12.0, తాంసిలో 12.3, ఇంద్రవెల్లిలో 12.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మారుమూల గిరిజన గ్రామాలను దట్టమైన పొగమంచు కప్పేస్తుంది. ఉదయం 9గంటల వరకు బయటకు వెళ్లేందుకే ప్రజలు భయపడుతున్నారు.

## విద్యావ్యవస్థలో సమూల మార్పులకు కృషి
### ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ట్వీట్






అమరావతి, **డిసెంబర్ 6(జర్నలిస్ట్ వార్త):** విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలనే ధృడ సంకల్పంతో తమ ప్రభుత్వం పనిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ట్వీట్ పెట్టారు. విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో, అధునాతన సదుపాయాలు కల్పించి, పోషక ఆహారాన్ని, నాణ్యమైన విద్యను అందించాలని ప్రభుత్వం భావిస్తోందని పేర్కొన్నారు. ఇదే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో మంత్రి నారాలోకేష్ చేస్తున్న కృషికి అభినందనీయమని ప్రశంసించారు. తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను భాగస్వామ్యం చేసేలా నిర్వహిస్తున్న మెగా పేరెంట్, టీచర్స్ మీటింగ్స్‌లో పాల్గొనడం ఆనందంగా ఉందని వ్యాఖ్యానించారు.

## ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడుగా విక్రమ్ పూల




అమరావతి, **డిసెంబర్ 6(జర్నలిస్ట్ వార్త):**మండలి వెంకట కృష్ణారావు అధికార భాషా సంఘం నూతన అధ్యక్షుడిగా పి. త్రివిక్రమరావు (విక్రమ్ పూల) నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఈ పదవిలో రెండేళ్ల పాటు కొనసాగుతారని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈ నియామకంతో పాటు అధికార భాషా సంఘం నిర్వర్తించాల్సిన కీలక బాధ్యతలను, కార్యాచరణను కూడా ప్రభుత్వం స్పష్టంగా నిర్దేశించింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే అధికారిక కార్యక్రమాల్లో ఆంగ్ల భాష వాడకాన్ని నియంత్రించి, తెలుగు వినియోగాన్ని ప్రోత్సహించడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించింది. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో తెలుగు వాడకం ఏ స్థాయిలో ఉందో తనిఖీలు చేసే అధికారాన్ని సంఘానికి కల్పించింది. తనిఖీల అనంతరం సంబంధిత అధికారులకు తగిన సూచనలు ఇవ్వాలని పేర్కొంది. తెలుగు భాష వినియోగంలో సాధించిన ప్రగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని, అధికార భాషాభివృద్ధికి అవసరమైన సిఫార్సులతో ప్రభుత్వానికి నివేదికలు సమర్పించాలని కూడా ప్రభుత్వ ఉత్తర్వుల్లో వివరించింది.

.........

# విపరీతంగా పెరిగిన విమాన టికెట్ల ధరలు

### సొమ్ము చేసుకుంటున్న విమానయాన సంస్థలు -ధరలపై గగ్గోలు పెడుతున్న ప్రయాణికులు

న్యూఢిల్లీ, **డిసెంబర్ 6(జర్నలిస్ట్ వార్త):** దేశీయ విమానయాన రంగంలో గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న గందరగోళం శుక్రవారం మరింత తీవ్రరూపం దాల్చింది. ఇండిగోకు చెందిన వందలాది విమాన సర్వీసుల రద్దు కావడంతో ఎదురైన పరిస్థితిని ఇతర విమానయాన సంస్థలు సొమ్ము చేసుకుంటున్నాయి. ప్రయాణికులను తీవ్రంగా దోచుకుంటున్నాయి. టికెట్ ధరలను భారీగా పెంచేశాయి. సాధారణ ధరల కంటే ఏకంగా 3 నుంచి 10 రెట్లు అధిక ధరలకు టికెట్లు విక్రయిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. అత్యవసర ప్రయాణాలు చేయాల్సిన వారికి ఇది పెనుభారంగా మారింది. ప్రధాన నగరాల మధ్య ఒక్కరోజు ప్రయాణానికి సంబంధించిన టికెట్ ధరలు ఆకాశాన్ని తాకాయి. శుక్రవారం నాటి ధరలను పరిశీలిస్తే ఢిల్లీ - బెంగళూరు విమాన టికెట్ ధర రూ. 1,02,000గా నమోదు కాగా.. చెన్నై - ఢిల్లీ మార్గంలో టికెట్ ధర రూ. 90,000కు చేరింది. అదేవిధంగా ఢిల్లీ - ముంబైకి ఒక టికెట్ ధర ఏకంగా రూ. 54,222 పలికింది. ఇతర విమానయాన సంస్థల టికెట్ల ధరలు కూడా రూ. 20 వేల నుంచి రూ. 40 వేల మధ్యలో కొనసాగుతున్నాయి. ముంబై - శ్రీనగర్ మార్గంలో సాధారణంగా రూ. 10 వేల లోపు ఉండే టికెట్ ధర, ఇప్పుడు రూ. 62,000కు పెరిగింది. రౌండ్ ట్రిప్ తీసుకుంటే దాదాపు రూ. 92 వేల వరకు ఉంటోంది.ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు ప్రయాణించాలనుకునే వారికి కూడా అధిక ధరల సెగ తగిలింది. శనివారం నాటి ప్రయాణానికి ఢిల్లీ–హైదరాబాద్ ఎయిరిండియా విమాన




టికెట్ ధర రూ. 33,000కు చేరుకుంది. సాధారణ రోజుల్లో ఈ మార్గంలో టికెట్ ధర కేవలం రూ. 5,000 నుంచి రూ. 7,000 మధ్య మాత్రమే ఉంటుంది. రాబోయే రోజుల్లో కూడా పరిస్థితి మెరుగుపడే సూచనలు కనిపించడం లేదు. డిసెంబర్ 7వ తేదీన ఢిల్లీ–చెన్నై ఎకానమీ క్లాస్‌లో కనీస టికెట్ ధర రూ. 53,000గా, ఢిల్లీ–హైదరాబాద్ కనీస ధర రూ. 25,000గా నమోదైంది. ఈ భారీ పెరుగుదల కారణంగా ప్రయాణాలు అత్యవసరం కానివారు తమ ప్రణాళికలను వాయిదా వేసుకుంటున్నారు. విమాన సర్వీసుల రద్దుపై ఇండిగో సంస్థ ప్రయాణికులకు క్షమాపణలు చెప్పింది. ఈ సంక్షోభంపై సోషల్ మీడియా వేదికగా వివరణ ఇస్తూ, "క్షమించండి... మిమ్మల్ని జాగ్రత్తగా చూసుకుంటాం" అని ప్రయాణికులకు సందేశం పంపింది. ఈ నేపథ్యంలో బాలీవుడ్ నటుడు సోనూ సూద్ స్పందిస్తూ, విమానాశ్రయాల్లోని ఇండిగో సిబ్బంది పట్ల దయతో మెలగాలని ప్రయాణికులను కోరారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'ఖాతాలో ఒక వీడియో సందేశాన్ని పోస్ట్ చేశారు. విమానం ఆలస్యమైతే కలిగే అసహనాన్ని తాను అర్థం చేసుకోగలనని, అయితే ఆ కోపాన్ని సిబ్బందిపై చూపించడం సరికాదని సోనూ సూద్ హితవు పలికారు. "దయచేసి ఇండిగో సిబ్బంది పట్ల దయగా, వినయంగా ఉండండి. విమానాల రద్దు భారాన్ని వారు కూడా మోస్తున్నారు. వారికి మనం మద్దతుగా నిలుద్దాం" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. ఇండిగో సమస్యల వల్ల తన కుటుంబ సభ్యులు కూడా ఎయిర్‌పోర్టులో దాదాపు 8 గంటల పాటు చిక్కుకుపోయారని సోనూ సూద్ వెల్లడించారు. "అక్కడ ప్రయాణికులు సిబ్బందిపై ప్రదర్శిస్తున్న కోపం, ఆగ్రహం చూసి చాలా బాధేసింది. వారిని తిడుతున్నారు, దుర్భాషలాడుతున్నారు. ఇది చాలా తప్పు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కౌంటర్ వద్ద నిల్చున్న ఉద్యోగి విమానం రద్దుకు లేదా ఆలస్యానికి కారణం కాదని గుర్తుచేశారు. "ఆ సిబ్బంది కూడా మనలాంటి ఉద్యోగులే. వారు కూడా గంటల తరబడి తిండి, నీళ్లు లేకుండా అందరి కోపాన్ని భరిస్తున్నారు. దయచేసి ప్రశాంతంగా, చిరునవ్వుతో మాట్లాడండి. సహకరిస్తే సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయి" అని సూద్ విజ్ఞప్తి చేశారు. అదే సమయంలో, "ఇండిగో, దయచేసి ఈ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించండి. చాలా మంది ఇబ్బంది పడుతున్నారు" అంటూ సంస్థ యాజమాన్యాన్ని ఆయన కోరారు.

# పురుషుడిపై మహిళ అత్యాచారం

### మహారాష్ట్రలో విచిత్ర ఘటన

పూణె, **డిసెంబర్ 6(జర్నలిస్ట్ వార్త):**మహారాష్ట్రలో ఓ విచిత్ర ఘటన వెలుగులోకి వచ్చింది. ఓ పురుషుడికి మత్తుమందు ఇచ్చి అత్యాచారానికి పాల్పడటమే కాకుండా, తనను పెళ్లి చేసుకోకుంటే రేప్ కేసు పెడతానంటూ ఓ మహిళ బెదిరించిన ఘటన పూణెలోని కోత్రుడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితురాలిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, ముంధ్వా ప్రాంతానికి చెందిన 37 ఏళ్ల వ్యక్తికి, కోత్రుడ్‌కు చెందిన 38 ఏళ్ల మహిళతో పరిచయం ఏర్పడింది. తాను హైకోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నానని ఆమె నమ్మబలికింది. బాధితుడిపై అతని భార్య పెట్టిన కేసులో న్యాయసహాయం చేస్తానని చెప్పి అతనికి దగ్గరైంది. ఈ క్రమంలో, అతనికి మత్తుమందు ఇచ్చి వేర్వేరు ప్రదేశాలకు తీసుకెళ్లి మూడుసార్లు అత్యాచారం చేసినట్లు బాధితుడు తన ఫిర్యాదులో ఆరోపించాడు. ఆ తర్వాత, నిందితురాలు తనను వివాహం చేసుకోవాలని బాధితుడిపై ఒత్తిడి తెచ్చింది. అతను అందుకు నిరాకరించడంతో, "నన్ను పెళ్లి చేసుకో, లేదా రూ. 2 లక్షలు ఇవ్వు. లేకపోతే నీపై అత్యాచారం కేసు పెట్టి జైలుకు పంపిస్తాను" అని బెదిరించినట్లు బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.